క్లుప్తంగా

కాంగ్రెస్‌లోకి బీజేపీ జిల్లా నాయకురాలు అశ్విని



అశ్వినికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే రోహిత్

రామాయంపేట(మెదక్): బీజేపీ జిల్లా నాయకురాలు, జిల్లా మహిళా మోర్చా మాజీ ప్రధాన కార్యదర్శి పోచమ్మల అశ్విని, ఆమె భర్త శ్రీనివాస్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ పటిష్టతకు తమవంతు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. కొందరు నాయకులు పథకం ప్రకారమే తనను బీజేపీ కార్యక్రమాలకు దూరంగా ఉంచారని, విధిలేక తాను పార్టీని వీడవలిసి వచ్చిందని ఆమె పేర్కొన్నారు.

అనాథాశ్రమంలో దుప్పట్ల పంపిణీ



పిల్లలకు దుప్పట్లు అందజేస్తున్న నాయకులు

నర్సాపూర్: బాబాసాహెబ్ డా.బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని అనాథాశ్రమంలోని పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి అనిల్ మండలంలోని మాడాపూర్‌లోని హోరెబు మినిస్ట్రీస్ ఆనాథాశ్రమంలోని పిల్లలకు ఆదివారం దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనిల్‌తో పాటు మాల మహానాడు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దాడిగ నరేశ్, ప్రభాకర్, భూమేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాతను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

చేగుంట(తూప్రాన్): రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతను చేగుంట ఆర్యవైశ్య సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. రామాయంపేటకు వచ్చిన ఆమెను సంఘం తరఫున కలిసి సన్మానం చేసినట్లు రఘురాములు తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వర్, పరంజ్యోతి తదితరులు ఉన్నారు.

సీఎంను విమర్శిస్తే ఊరుకోం

యూత్‌కాంగ్రెస్ నేత శ్రీకాంత్



శ్రీకాంత్

చేగుంట(తూప్రాన్): ముఖ్యమంత్రిని విమర్శించేవారికి తగిన బుద్ధి చెబుతామని యూత్‌కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు బోయిని శ్రీకాంత్ హెచ్చరించారు. ఆదివారం చేగుంటలో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకురాలు కత్తి కార్తీక దౌల్తాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేయడాన్ని ఖండించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రోత్సాహంతో కొంతకాలంగా ఆమె చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, విమర్శలు మానకుంటే ఊర్లలో తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కూచన్‌పల్లి కూచాద్రి వెంకటేశ్వరాలయ వార్షికోత్సవంలో భాగంగా శనివారం రాత్రి ఘనంగా రథోత్సవం నిర్వహించారు. పూజారులు ఆనవాయితీ ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

నిజాంపేట(మెదక్): అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన అంబటి నారాగౌడ్ ఇంటిని ఆదివారం సోదా చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లు దొరికాయని ఆయన తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బడుగులకు వెలుగు అంబేడ్కర్

జిల్లావ్యాప్తంగా డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం అంబేడ్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని పలువురు నేతలు, అధికారులు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీల కార్యాలయాల్లోను వేడుకలు నిర్వహించారు. నర్సాపూర్ పిల్లల పార్కులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. అంబేడ్కర్ ఎందరో అణగారిన జీవితాల్లో వెలుగు నింపారన్నారు. అనేక దేశాల రాజ్యాంగాలకు స్ఫూర్తిదాయకంగా ఉండే విధంగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ మన రాజ్యాంగాన్ని రూపొందించారని పలువురు నేతలు కొనియాడారు. అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.



నర్సాపూర్: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు



రామాయంపేటలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



చేగుంటలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్



నర్సాపూర్: ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు



వెల్దుర్తిలో భీం వారియర్స్ సభ్యుల నివాళి



మనోహరాబాద్(తూప్రాన్): జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ హేమలత



అల్లాదుర్గం(మెదక్): బహిరన్‌దిబ్బ గ్రామంలో..



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్‌లో..



పెద్దశంకరంపేటలో..



కౌడిపల్లి: వెల్మకన్నలో..



మనోహరాబాద్(తూప్రాన్): దండుపల్లిలో..

ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

రామాయంపేట(మెదక్): ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు హామీ ఇచ్చారు. ఆదివారం రామాయంపేటలో జరిగిన ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. కార్పొరేషన్ ఏర్పాటు విషయంలో గత ప్రభుత్వం ఆర్యవైశ్యులను మోసగించిందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ఎప్పుడూ ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ చైర్మన్ సుజాత, మెదక్ మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, చిన్నశంకరంపేట మాజీ ఎంపీపీ బోయిని అరుణ ప్రభాకర్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామచందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడిగా పబ్బా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, కోశాధికారిగా గుండు సత్యనారాయణ, పీఆర్‌ఓగా కాసం రాజు, ఆర్యవైశ్య మహాసభ మహిళా అధ్యక్షురాలిగా ఎనిశెట్టి శ్రీవాణి ప్రమాణస్వీకారం చేశారు.

భవిష్యత్ కార్యాచరణపై త్వరలో నిర్ణయం

కేంద్ర ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్

పెద్దశంకరంపేట(మెదక్): తన రాజకీయ భవిష్యత్ కార్యాచరణపై త్వరలో నిర్ణయం ప్రకటిస్తానని కేంద్ర ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్ చెప్పారు. ఆదివారం ఆయన నివాసంలో ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో మాజీ చేనేత సహకార సంఘం చైర్మన్ కృష్ణమూర్తి, గంగాధర్‌గౌడ్, శంకరయ్య, గంగారం తదితరులున్నారు.



సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

శివంపేట(నర్సాపూర్): స్థానిక ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 2005-06 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న ఆ విద్యార్థుల కలయికకు మండలంలోని చెండి జేఎస్ఆర్ ఫంక్షన్‌హాల్ వేదికైంది. ఈ సందర్భంగా అప్పటి గురువులను సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సందడి చేశారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులతో పాటు మహిపాల్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరెడ్డి, అంజి, సరిత తదితరులు ఉన్నారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోయడం ప్రమాదకరం

కేసులు తప్పవని ఎస్‌ఐ హెచ్చరిక

రామాయంపేట(మెదక్): రోడ్డుపై రైతులు ఆరబోస్తున్న ధాన్యం కుప్పలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అలాంటి వారిపై చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. స్థానిక ఎస్‌ఐ రంజిత్, తన సిబ్బందితో పలు మార్గాల్లో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలను ఆదివారం పరిశీలించారు. జాతీయ రహదారి పక్కనే దామరచెరువు తండాదారిలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలను పరిశీలించిన పోలీసులు ట్రాక్టర్‌లో ధాన్యాన్ని పక్కకు తొలగించారు. మరోసారి రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు. రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే రాత్రివేళలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఈవిషయమై సంబంధితులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు.



ధాన్యం కుప్పలను తొలగిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడ్చల్‌లో ఘటన



సిద్దిరాములు(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామానికి చెందిన కరణం పెద్ద సిద్దిరాములు(55) మేడ్చల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం పనులు ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరిన ఆయనను రాంగ్‌రూట్‌లో వచ్చిన బస్సు ఢీకొట్టింది. దీంతో అక్కడిక్కడి మృతి చెందాడు. సిద్దిరాములు మెడ్చల్‌లో ఫర్నిచర్ షాప్‌లో పనిచేస్తూ ఇంటి నుంచి రాకపోకలు సాగిస్తాడు. దీంతో సూరారంలో విషాదచాయలు అలముకున్నాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ధర్మపురి(ఫైల్)

నిజాంపేట(మెదక్): బైక్ అదుపుతప్పిన ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట మండల పరిధిలోని అక్కన్నపేట గ్రామానికి చెందిన రాగి ధర్మపురి(35) ఫారెస్ట్ ఆఫీస్‌లో వాచర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 6న సిద్దిపేట జిల్లా భూంపల్లి మండలంలోని తాళ్లపల్లి గ్రామంలోని తన బంధువు ఇంటిలో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ అదుపు తప్పి ప్రక్కనే ఉన్న డ్రైనేజీలో పడిపోయాడు. అతడిని కుటుంబ సభ్యులు రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఘనంగా బండ్ల ఊరేగింపు



జగ్గంపేటలో ఎడ్ల బండ్ల ఊరేగింపు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని జగ్గంపేట గ్రామంలో జరుగుతున్న నల్లపోచమ్మ జాతరలో భాగంగా ఆదివారం అమ్మవారికి ఘనంగా ఎడ్ల బండ్ల ఊరేగింపు కొనసాగించారు. గ్రామస్తులు తమ ఎడ్ల బండ్లను అందంగా అలంకరించి, గ్రామం చుట్టూ ఊరేగించారు. యువకులు, చిన్నారులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ



దుండగులు పగులగొట్టిన తలుపు

శివంపేట(నర్సాపూర్): గుర్తు తెలియని వ్యక్తులు అంగన్‌వాడీ కేంద్రంలో చోరీకి పాల్పడిన ఘటన మండల పరిధి కొత్తపేటలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ప్రధాన ద్వారాన్ని ధ్వంసంచేసి లోనికి చొరబడిన దుండగులు కేంద్రంలోని గ్యాస్ సిలిండర్, పొయ్యి, 9 నూనె ప్యాకెట్‌లు, 11 కిలోల కంది పప్పును చోరీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ రాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైభవంగా సీతారాముల పల్లకీసేవ



సీతారాముల పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఆదివారం సీతారాముల ఉత్సవ విగ్రహాలను గరుడవాహనంపై ఘనంగా ఊరేగించారు. భజనలు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగించగా మహిళలు స్వామి,అమ్మవార్లకు మంగళహారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కనకరాజు, ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మురళీ, సభ్యులు ఆర్ఎన్ సంతోష్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, రాగం సిద్దు, రాగం శ్రీనివాస్, గుజ్జరి అనిల్‌కుమార్ తదితరులున్నారు.

మోపెడ్‌ను ఢీకొన్న కారు

ఒకరికి తీవ్ర గాయాలు

కౌడిపల్లి(నర్సాపూర్): కారు, మోపెడ్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని రాయిలాపూర్ పెట్రోల్‌బంక్ సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రంజిత్ కుమార్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జాజితండాకు చెందిన అంబ్రియానాయక్ తన టీవీఎస్ మోపెడ్‌పై తండాకు వస్తున్నాడు. ఈ క్రమంలో రాయిలాపూర్ పెట్రోల్‌బంక్ సమీపంలో మెదక్ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేసున్నారు.



ఘటనా స్థలంలో పడిఉన్న అంబ్రియానాయక్

సంక్షిప్త వార్తలు

◆ అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

రామాయంపేట(మెదక్): అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక ఫైర్‌స్టేషన్‌లో సిబ్బంది పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఫైర్ అధికారి స్వామిరెడ్డి ఆధ్వర్యంలో విధి నిర్వహణలో అశువులు బాసిన అగ్నిమాపక సిబ్బందికి సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు. 14నుంచి 20వరకు పలు కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని స్వామిరెడ్డి తెలిపారు. సిబ్బంది చంద్రాగౌడ్, నవీన్‌గౌడ్, సిద్దరాములు, నవీన్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆలయ నిర్మాణానికి విరాళం

నిజాంపేట(మెదక్): చల్మెడ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న మడేలేశ్వర శీతలాదేవి ఆలయానికి మాజీ ఉపసర్పంచ్ తుమ్మల రమేశ్ రూ.10వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా రజక సంఘం సభ్యులు ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. 22న జరిగే విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.



◆ బీజేపీ ఇంటింటా ప్రచారం



హవేళిఘణాపూర్(మెదక్): కూచన్‌పల్లి గ్రామంలో బీజేపీ నాయకులు మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

◆ చాముండేశ్వరి అమ్మవారికి మొక్కులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు. ఒడిబియ్యంతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశామన్నారు.

◆ బంగారమ్మా.. దీవించమ్మా..

మనోహరాబాద్(తూప్రాన్): బంగారమ్మా చల్లగా దీవించమ్మా అంటూ పలు గ్రామాల ప్రజలు కాలకంఠి బంగారమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని కాళ్లకల్ గ్రామ శివారులో గల బంగారమ్మ అమ్మవారిని ఆయా గ్రామాల భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం వనభోజనాలు చేశారు.

◆ కాంగ్రెస్‌లోకి చేరికలు



మనోహరాబాద్(తూప్రాన్): మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కోనాయపల్లి(పీటి) గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి నర్సారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, మన్నె కల్యాణ్, లక్ష్మారెడ్డి, మోహన్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, సుధాకర్, నరేశ్, సురేశ్, భానుగౌడ్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశవాద పార్టీలను ఓడించండి

మద్దూరు(హుస్నాబాద్): లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మతోన్మాద, అవకాశవాద పార్టీలను ఓడించి ప్రజాసమస్యలపై పోరాడుతున్న సీపీఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ అన్నారు. ఆదివారం దూళ్మిట్ట మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలతో దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిందన్నారు. సీపీయం అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్‌లో రెడ్డి, ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మకు బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలను ఊరేగింపు తీసుకెళ్లారు. ముందుగా అమ్మవారికి పూజలు చేశారు. బోనాలతో గుడి చుట్టూ ప్రదక్షిణలుచేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.